రామ రామ!

పానుగంటి లక్ష్మీ నరసింహారావు గారు

'ఏదీ! ఒక్కముద్దే కాదా! ఊఁ' యనుచు నెడమ మోఁచేతిని ప్రక్కపై నాని కుడిచేతిని భార్యపై వైచి నడుమువఱకు లేచి తన మోమును భార్య మోమున జేర్పఁబోయి మూతి పొడుగు చేసిన రంగరావు నట్టె యదలించి మోము మఱల్చుకొని గిరుక్కున నెడమవంక కొత్తిగిల్లి "అబ్బ! నాకు నిద్ర వచ్చుచున్నది. ఎప్పుడు నొక్కటే ముద్దులా! చాలు" నని కృష్ణవేణమ్మ రంగరావును బలుచఁబలుచఁగ మందలించెను. పదునైదు దినముల క్రిందటనే కాపురమునకు వచ్చిన పడుచుపిల్ల. పగలెల్ల నింటిలో నేదో చిన్న పెద్ద, బరువు తేలిక పని తప్పదయ్యెను. పండ్రెండు గంటలు దాఁటిన తరువాతనైన నాపిల్లకు నిద్ర రాఁగూడదా? అది తప్పా! "అబ్బ! ఇటు తిరుగు; ఒక్కటే నిద్రయా?" యని రంగరావు భార్యను దనవంకకుఁ ద్రిప్పుకొనఁబోవఁగ మంచపుఁ బట్టెను గుడిచేత నామె కౌఁగిలించుకొని బిఱ్ఱబిగిసెను 'ఒక్కటే ముద్దులా' యని భార్య విసుఁగుదల యయ్యెను. 'ఒక్కటే నిద్రయా' యని భర్త సాధింపయ్యెను. ఇఁక సంధియెట్లు? తనకేమి రెండవ పెండ్లివాఁడు; నలువది యేండ్లుగడచినవాఁడు; ప్రపంచకష్టముల నెఱిఁగినవాఁడు. తన కెంతకైన నిద్ర రాకపోవచ్చును. అయ్యో! కుఱ్ఱది-పదుమూఁడేండ్లది. దానియీడున వయస్సు రాని వారెందఱో యున్నారు కదా! అది నిద్ర కాఁగలేకపోవుట హానియా? అపకీర్తియా? ఈమాత్రపు ఔచిత్యము తన కేల యుండఁగూడదు? ఇంటిలో స్థిరముగాఁ బడియుండుటకు వచ్చిన పెండ్లాముకదా! నూఱేండ్ల కాపురముకదా! తిరుగఁ దెల్లవాఱదా? ఇంతలో నేమి పుట్టిమునిఁగినది. 'అద్దద్దె' యని తన కొంటిగంట వేళ నొకముద్దెందుకు? భార్య లేఁత పిల్లకావున నూరకున్నదికాని యాఱితేఱినగడుసుదే యైనయెడల భర్తను మూఁతిమీఁదఁ బొడుచునేమో! అది యట్టిదే యైనయెడల దానిచిత్తము ననుసరించియే యాతఁడు ప్రవర్తించునేమో?'.........................

కుడిచేతితర్జని నల్లలాడించుచు. "నింతేకాదా! యింతేకాదా! సరే." యని భర్త రెండవవైపున నొత్తిగిల్లి పండుకొనెను. ఇంతేకాదా ఇంతేకాదా యనఁగా నర్థమేమో? ఇంతసేపు బతిమాలినదానిఫల మింతేకాదా యనియా? ఇంతధనము దగులఁబెట్టుకొని పెండ్లిచేసికొనినందులకుఁ బర్యవసాన మింతేకాదా యనియా? ఇఁక నీకు నాకు నింతేకాదా యనియా? ఎట్లు తెలియవచ్చును? కాని 'సరే' యనఁగ నర్థమేమో? తెల్లవాఱినపిమ్మట నిన్ను బారగఱ్ఱలను గట్టించి కొట్టింతు ననియా? కాక, యిఁక నీదారి నీది నాదారి నాది యనియా? పాపము! ఆయిల్లాలివలన నెంత యపరాధము జరిగినదో? ఎంత సంసారఘాత సిద్ధించినదో? కాని, యీమాత్రమైన సహించుకొనలేని భర్తకు రెండ

వపెండ్లికూడ నెందులకో?......................

....

ఏమి చేయవచ్చును? రంగరావు మిక్కిలి యొడిదొడుకు స్వభావముకలవాఁడు; కత్తిపదను నైజముకలవాఁడు; అందులో మాఱుమనువువాఁడు; మఱలుకల వయస్సువాఁడు; భార్యయందుఁ బంచప్రాణములు పెట్టుకొన్నవాఁడు; భార్యకూడఁ దనయందంత ప్రేమముతోనే యుండవలసిన దన్నవాఁడు; అట్లుండక తప్పదని సిద్ధాంత పఱచినవాఁడు; భార్యనుజూచి పొంగిపోవువాఁడు; భార్యకూడఁ దన్నుఁజూచి తనలాగుననే పొంగకపోయినయెడల వీలులేదన్నవాఁడు; భార్యాభర్తలనుకూలముగ నుండఁ దలఁచిన యెడల నొకరినొకరు కౌఁగిలించుకొని కూరుచుండవలసిన దన్నవాఁడు; కాని యెడల, భర్త యజ్ఞోపవీతము తీసివైచి కాశిలో, భార్య తల గొరిగించుకొని రామేశ్వరములో నుండవలసినదన్న మతములోవాఁడు; అంతే కాని, మధ్యమ మార్గ మొక్కటి యుండవచ్చు నను కొన్నవాఁడు మాత్రముకాఁడు......

....

అట్టి ప్రకృతిగల రంగరావునకు భార్య వెన్నిచ్చిన యెడలఁ దలమంచుకొని పోవదా! భార్య మొగము చిట్లించుకొనఁగ గుండెలలోఁ బొడిచినట్లుండదా? భార్య మంచపుఁ బట్టెను గౌఁగిలించుకొని పండుకొనినదనఁగ దన్ను గొంతువఱకుఁ బూడ్చినట్లుండదా?..........

....

తన ప్రకృతిలాగుననే తన యిల్లాలి ప్రకృతి యుండవలసినదని యెచ్చటనైన నున్నదా? లేకపోవుఁగాక! తన ప్రకృతికి సరిపోయినట్లు తన యిల్లాలు తన ప్రకృతినేల మార్చుకొనఁగూడదను పట్టుదలకలవాఁడు. ప్రకృతి మారుటకు సాధ్యమగునో కాదో యాసంగతి యటుంపుఁడు. తానే తన ప్రకృతిని భార్యాప్రకృత్యనుగుణముగ నేల మార్చుకొనఁగూడదో? ఊహుఁ! అది పనికిరాదు. ఏవరెవరి ప్రకృతి పరిపాకము లెట్లున్న సరే; యెవరియిష్టానిష్టత లెట్లున్న సరే; యందఱుఁగూడఁ దాను 'గీ' యనఁగఁ 'గీ' యనవలయుననియుఁ, దనకొనవెట్టులకు శిరఃకంపన మొనర్పవలసినదనియు బ్రతి నరప్రకృతిలో నున్నది కాని లేకపోలేదు. కొందఱకుఁ గొఱ్ఱగింజయంతయుఁ గొందఱకుఁ గుంకుడుగింజయంతయు నుండగ, రంగరావునకుఁ గోడిగ్రుడ్డంతయున్నది..................

....

భార్య ముద్దీయకుండఁ బండుకొన్నదని తహతహలాడిపోవుచున్నాఁడు; అంటుకొన్న పూరికొంపవలె లోలోపలనే కుమిలికుమిలి కూలుచున్నాఁడు; కవులు తమగ్రంథములలో వ్రాసిన ప్రణయకలహమై యుండునా యని రవంత సందేహించినాఁడు; మంచువలె వెంటనే విడిపోవలసినదే కాని యింత త్రాడుతెగువఱకుఁ బ్రణయకలహ ముండదని సిద్ధాంతపఱచుకొన్నాఁడు; కమ్మరితిత్తివలె నూపిరిని బూరించి రెండేసిబారల మూల్గులు మూల్గుచున్నాఁడు; భార్యకుఁ దనయందిష్టత లేదని సిద్ధాంతపఱచుకొన్నాఁడు, ఎందుచేత—రెండవపెండ్లివాఁడగుటచేత; రెండుయామములు దాఁటినవాఁడగుటచేత, పెండ్లి చేసికొనుమని చెప్పిన

స్నేహితులనుఁ దిట్టినాఁడు. పెండ్లికుదిర్చినబంధువులనుదిట్టినాఁడు. పెండ్లి చేయించినపురోహితునిదిట్టినాఁడు; ఇట్టి పనికిమాలిననిర్భాగ్యురాలి నేలకనవలయుననియత్తమామలనుదిట్టినాఁడు; తన్నుఁ దిట్టుకొన్నాఁడు; 'ప్రక్కలో ముండ్లకంపవు; నీ వెక్కడ దాఁపురించితివే' యని పెండ్లామును దిట్టినాఁడు; కాని యిల్లాలి ప్రక్కలోఁ దా నెలుఁగుబంటివలె నుంటిననుసందేహ మాతనికిఁ దోఁచిన ట్లింతవఱకగపడలేదు....

....

పెండ్లాము చెప్పవచ్చినప్పుడు మొదటి పెండ్లామే పెండ్లామని తనపూర్వకళత్రమును గొంత ప్రశంసించినాఁడు; ఆమెకుఁ గ్రోధమెక్కువయని కొంత మనసులోఁ దిగఁబీఁకుకొనినాఁడు; ఆమెయెడల నప్పుడప్పు డనాదరణ చూపినందులకు లెంపలు వైచికొన్నాఁడు; ఆమెయే బ్రదికియుండునెడలఁ దన కిప్పు డీగతి పట్టకయే యుండునని పరితపించినాఁడు......

....

ప్రస్తుతభార్యకుఁ దనయందిష్టము కలుగుట కేమిచేయవలయునా యని గుబ్బెటలు పడుచున్నాఁడు; ఆతంకనిగ్రహమాత్ర లందులకు మంచివేమో యని మదరాసువంక తిరిగినాఁడు; స్త్రీవశ్యపుమందు లమోఘములని గోదావరిజిల్లావంక తిరిగినాఁడు; బాలెంతచావు చచ్చినపెద్దభార్య దీని నావేశించి యిప్పుడు తనకు ముద్దీయకుండఁ జేసినదేమోయని సందేహపడి మంత్రశాస్త్రవేత్తయైన కృష్ణశాస్త్రులుగారు మరణించినందులకు రవంత విచారించినాఁడు; గ్రహవిముక్తికి గంగాస్నానము దురాకట్టని స్థిరపఱచినాఁడు;............

....

ప్రక్కపాటునఁ దలగడకుఁ జివరఁబెట్టినతల రవంతజాఱుటచే మంచముపైనుండి క్రిందికిఁ బడిపోవుచున్నానేమోయని యులికిపడి లేచి వెంటనే సంబాళించుకొని వీఁపుపైఁ బండుకొని కన్నులు తిరుగ మూసికొనినాఁడు...

...గుండెలపై రెండుచేతు లున్నవి. చెవియొద్ద దోమ గుయ్యిమనుచున్నది. తాను గుఱ్ఱుతీయుచు నడుమనడుమఁ గెక్కు కెక్కు మనుచున్నాఁడు.

స్వప్నము

చెదఱిన ముంగురులతో మేలుముసుఁగుతో రవంత చొక్కినదౌడలతోఁ బండ్లకప్పుతోఁ దేలిపోవుచున్న కన్నులతోఁ దాంబూలరక్తిగల పెదవులతోఁ జెవుల దూదిపింజలతో, నడుమునకుఁ గట్టుతో, నిండైన వక్షముతోఁ బ్రత్యక్షమైన పెద్దభార్య సుబ్బమ్మయు, రంగరావు నిట్లు మాటలాడుకొనుచుండిరి.

సుబ్బ:—నేను బోయినపిమ్మటఁ దిరుగఁ బెండ్లి చేసికొననని నీవనలేదా? ఆమాట మఱచిపోఁదగునా? అది నీప్రక్కలో నుండుట నేను సహింతునా?

రంగ:—బుద్ధిలేక చేసికొంటిని. క్షమింపుము.

సుబ్బ:—చేసికోఁబోయి చేసికోఁబోయి యిట్టి కొంకనక్కను జేసికొంటివేల?

రంగ:—అబ్బే! అది యనాకారణియా?

సుబ్బ:—దానిసౌందర్యమును జూచి మురిసిపోవుచున్నావా? ఛీ! ముద్దిమ్మని నీ వెంతబతిమాలిననైన నొప్పుకొన్నదా? నీవనఁగ దానికిష్టమనియే యనుకొంటివా?

రంగ:—ఆ—నాయం దిష్టత లేనేలేదా?

సుబ్బ:—నీపైఁ గావలసినంత రోఁత కూడను.

'అటులైనఁ జెప్పుదీసి కొట్టెద'నని బిగ్గఱగ నఱవఁబోయి మాట పైకిరాక 'బే' యని యఱచి యులికిపడి రంగరావు నిద్రనుండి లేచెను...................................

....

గడగడ వడఁకుచున్నాఁడు; ఒడలినిండ ముచ్చెమటలు పట్టినవి; అటునిటు కొంతసేపు గుర్తులేకుండఁ జూచినాడు. కనులు రవంత మూసికొని తెఱచుసరికి దీపము గంటలాగున వెలుఁగుచున్నది. దోమ చెవియొద్దగాన మొనర్చుచునే యున్నది. చిన్నగుఱకఁ దీయుచుఁ గృష్ణవేణమ్మ ప్రక్కపాటుననే పండుకొని యున్నది. తహతహలాడుచున్న మనస్సును రవంత కుదుటఁబఱచుకొని నిదానించుకొని స్వప్నమంతయుఁ దిరుగఁదోఁడికొనినాఁడు. "నాపై రోఁతయే! నాపై రోఁతయే!" యని గుప్పిళ్ల గట్టిగఁ బట్టుకొని పండ్లు బిగఁబట్టి కొంతసేపు గింజుకొనినాఁడు. "అనిష్టత యుండవచ్చునుగాని యసహ్యతకూడ నేల యుండవలయును? పెద్దభార్య స్వప్నమునఁ జెప్పినమాటలసత్యములు కావు. ప్రస్తుతభార్య దుష్టశీల యయియుండుట నిశ్చయము. దానికి మఱియొకనియం దిష్టముండుటచేతనే నాయం దింత రోఁతకలిగినది. ఆహా! ఆపాదశిరఃపర్యంతము మండుకొనిపోవుచున్నదే? ఏమి చేయుదును? దీనిసత్యము నా కెట్లు తెలియఁగలదు? అయ్యయ్యో? పులివిస్తరాకునాఁకితినే? ఎంతదుర్గతి సంభవించినది? ఓసినిర్భాగ్యురాలా! ఓసితుచ్ఛురాలా! నన్నుఁ దగులఁబెట్టితివే! పాంసులా! నీముద్దులమగనికి ముద్దిచ్చెదవుకాని నాకిచ్చెదవా? ముద్దిమ్మని నిన్నడిగి నానోరపవిత్రముగఁ జేసికొంటినే? థూ! థూ! నీగొంతుకోసిననైనఁ బాపమున్నదా!......
...."

బీరువామీఁది గడియారము టంగుటంగున రెండుగంటలు కొట్టినది. రంగరావు మంచముమీఁదఁ గూరుచుండి భార్యవంకఁ జూచుచున్నాఁడు. ఆమె ప్రక్కపాటునఁ బండుకొనుట చాలించి వెలికిలఁబడి పండుకొని నిద్రించుచున్నది. మడఁచినకుడిచేయిఁ యెడమడొక్కపై నున్నది. ప్రక్కపాటున నిలువుగఁ జాఁపఁబడిన యెడమచేతివ్రేళ్లు పఱుపును రవంత దాఁటియున్నవి. ఒత్తగిలి పడినప్పుడు కుడిజెబ్బసందిటఁ బడిన మంగళసూత్రపునానింక నచ్చటనే యున్నది. కోలవాటగుమోమగుటచేతను నెత్తైన తలగడపైఁ దల యుండుటచేతను గడ్డముకొన నంటియున్న పైఁట చెఱఁగుటంచు బోఁడతరపుఁ బూలు చిన్నారి శ్వాసముచే రవంతకదలిన ట్లగపడుచున్నవి. ఒడ్డాణమునడుమ నున్న పువ్వు మనఃపండు రవంత దాఁటి తను స్పర్శనాభిలాషచే వట్టి కడుపు నంటి పట్టుకొని సొమ్మసిల్లిన ట్లున్నది. కుడిపిక్క యెడమపిక్కపై వైచి

యుంటచేఁ గుడియెడమ బొట్టనవ్రేళ్ల గోళ్లు లొకదాని నొకటి ముద్దుపెట్టుకొనుచున్నవి. ఒత్తగిల్లి పండుకొనునప్పుడు చెదరుటచేఁ గుడి చెంపముంగురులలో రెండంగుళముల పొడుగు గల కుచ్చొక్కటి తిలకమును సమీపించి దాని లోని కస్తూరి నాఘ్రాణించుచున్నదేమో? రవంత విడిన పెదవులనడుమనుండి పలువరుస యంచు కొంత కానఁబడుచున్నది. మొగ మెంత ప్రసన్నముగనైన నున్నది. బంగరు బొమ్మవలె నున్న యా బాలికను గాంచి భర్త- పనికిమాలిన భర్త- గుఱ్ఱుమను చున్నాఁడు; గ్రుడ్డు త్రిప్పుచున్నాఁడు; తలపంకించుచు న్నాఁడు..............................

ఆహాహా! అదియేమి? గుల్ షబుపూవు వికసించిన ట్లామె నిద్రలోనే మందహాస ము నర్చుచున్నదే! దీపకిరణములగిలిగింతచేఁ బది దినములబిడ్డఁడు నవ్వగ నెట్లుండునో యామెన వ్వట్లు ప్రకాశించుచున్నదే! స్వర్గమునుండి దిగి వచ్చిన ట్లున్న యానవ్వను గాంచి యింత రౌద్రస్వరూపుఁడైన రంగరావుకూడఁ దెల్ల వోయినాఁడు. అట్టె జలదరించినాఁడు. అంతలో శాంతించినాఁడు.........................

ఆమె యెందులకు నవ్వెనో! "నీ వెంత వెఱ్ఱిముండకొడుకవురా" యని యామె ప్రకృతి నవ్వియుండునేమో? అట్లు కాదు. ఆనవ్వులో హేళనకళంక మెటను గానఁబడలేదు. కాక పాప మింకఁ బసిబాలకావునఁ దోడిపిల్లలతో గ్రచ్చకాయలాడుకొనినట్లో దాఁగుడుమూఁత లాడుకొనినట్లో కలఁగని యాసందర్భమునఁ గలిగిన చమత్కారమునకు నవ్వినదేమో? అదియుఁ గూడఁ గాదేమో? ఏమైననేమి? పాలమీఁగడవంటి యాపిల్లగొంతు గోయుటకు భర్త యింతకుముందే కాదా సంకల్పించికొనినాఁడు. ఎందువలన నట్లు సంకల్పించికొనినాఁడు? ఆమె దుష్టచారిత్ర యగుటవలన— నిదర్శన మేమున్నది?— ముద్దియకుండఁ బండుకొన్నది —సాక్షియెవరు? చచ్చినపెద్దభార్య— ఎప్పుడు చెప్పినది? — స్వప్నములో. ఆహాహా! ఇల్లునిండినమగఁడు! కథాలంకారమైన నాయకుఁడు!.............................

కాని రంగరావేదో దీర్ఘాలోచన చేయుచున్న ట్లున్నాఁడు. ప్రస్తుతభార్యయందుఁ గ్రోధమున్న పెద్దభార్యమాటలకంటెఁ బ్రబలతరమైన నిదర్శన మేదైన లభించువఱకు నీమెను జంపఁగూడదు. అప్పుడైన నింతలావణ్యవతిని జంపుటకంటె విడిచిపెట్టుటమంచిదేమో! ఎందువలన? ఈమెను జంపినయెడలఁ దిరుగఁ బెండ్లి కాదు—వహావ్వా! లోకోత్తరమైనకారణ మిక్కడకు వెల్లడియైనది. ఈమె పరిశుద్ధి స్పష్టమగువఱకు నీమెను దగులకుండ దూరముగాఁ బండుకొనవలయును. ఈరాత్రి కిటనే పండుకొనెదను.............వెలికిలఁబడి పండుకొనినాఁడు..............................

స్వప్నము

తిరుగ స్వప్నమున సుబ్బమ్మ సాక్షాత్కా-రించినది. రంగరావు నామెయు నిట్లు మాటలాడుకొనుచుండిరి.

రంగ:—దానికి నాపై రోఁత యంటివి కదా? ఎందులకు రోఁతకలుగవలయును?

సుబ్బ:—అందఱి మర్యాదయు నొక్కటే. ఆకారణమున నీవు నన్నడుగఁ దగదు. నేను జెప్పఁదగదు.

రంగ:—ఆఁ—నే ననుకొన్నమాటయే నీవు చెప్పక చెప్పుచున్నావు. సరేకాని దాని దోషమును గూర్చి నాకుఁ దగిననిదర్శనము గలుగుటెట్లు?

సుబ్బ:—నిదర్శనము కలిగినయెడల నేమి చేయుదువు?

రంగ:—దానిని విడిచిపెట్టెదను.

సుబ్బ:—ఏడువలేకపోయినావు. అట్లు చేసినయెడల నీయింటియెదుటనే గుడిసె వైచి యది సంత సాగించును.

రంగ:—నామనస్సులోని సందేహమే నీవు చెప్పినావే. అటులైన నేమి చేయవలసినది?

సుబ్బ:—ఏమి చేయవలసినదని నన్నడుగుట యెందులకు? నీవు దానిని జంపుటకు సంకల్పించుకొనియే యున్నావుకదా. దానికి నీచేతిలోఁ జావున్నది.

రంగ:—ఆమాట నిజమేలే. దాని కెప్పుడు చావున్నది?

సుబ్బ:—ఎప్పుడో యన నేల? ఇప్పుడే.

రంగ:—చంపుటకుఁ బ్రబలమైననిదర్శన మేది? అది లభించునంతవఱకుఁ జంపను.

సుబ్బ:—మొత్తుకొనినట్లే యున్నది. పదిమంది నెదుటఁ బెట్టుకొని నీభార్య తప్పు చేసియుండునా?

రంగ:—ఆమాటయు నిజమే. మఱి అటులైన?

సుబ్బ:—నీమొగము—నీమోర. నీకు నిదర్శనము కావలయు నేమి? న్యాయస్థానములలో నిదివఱకు జరిగిన వ్యవహారములలోఁ బ్రబలనిదర్శన మొకదానిలో నైనఁ గలిగినట్లు నీవు వినియుంటివా? ప్రబలనిదర్శనములు లేవని న్యాయస్థానశిక్ష లాఁగినవా? గుఱికి బారెడు హెచ్చుతగ్గయినకారణములకేఁ గాలక్షేపము జరుగుట లేదా?

రంగ:—పోనీ! అట్టిస్వల్పకారణములైన నా కేమి లభించినవి?

సుబ్బ:—నేను జెప్పితిని గాదా? నే నసత్యమాడితినా?

రంగ:—నీకు దానికి శత్రుత్వము. నీ మాట నేను నమ్మను.

సుబ్బ:—అటులైన నీవుదానిని జంపవు?

రంగ:—ఊహుఁ.

సుబ్బ:—చేతఁగాని చచ్చుపెద్దమ్మవు. నీవలన నేమగును? దానిగొంతుకొఱికి నేనే చంపెదను. (సుబ్బమ్మ 'ఆ'యని నోరు తెఱచి సమీపించును.)

రంగ:—దానిని ముట్టుకొనినయెడల నీ గొంతు నులిమెదను. (గొంతుపట్టుకొని నులుముచున్నాఁడు). నాభార్యను నేను జంపవలయును గాని నీ వేల చంపవలయును? చావుము చావుము. తన్నెదవా? నేలను బడఁగొట్టి త్రొక్కెదను. (కావు కేకలు వైచుచు మంచమునుండి క్రిందఁబడెను.)

రంగరావిట్లు క్రిందఁబడి కెవ్వన నార్చి కనులు తెఱచి చూచుసరికిఁ దనకాళ్లముందు కృష్ణవేణమ్మ చచ్చి పడియుండెను. ఎంతదారుణహత్యజరిగెనో! రామరామా!